క్లుప్తంగా

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



పూజాకార్యక్రమంలో ఎంపీ చామల

మంచాల: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని, తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పెద్దమ్మ తల్లి కల్యాణోత్సవంలో ఎంపీ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎంపీతో పాటు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, ఎమ్మెల్యే తనయుడు మల్‌రెడ్డి అభిషేక్ రెడ్డిని ముదిరాజ్ నాయకులు ఘనంగా సన్మానించారు. పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, జయమ్మ, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, బుగ్గరాములు, మల్లేశ్, జంగయ్య గౌడ్, వాజీద్, మార సురేష్, నీలం కృష్ణ, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సర్దుబాటు ప్రక్రియను పునఃపరిశీలించాలి

తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్

మంచాల: ఉపాధ్యాయు ల సర్దుబాటు పేరిట ప్రాథమిక పాఠశాలలో టీచర్లు లేకుండా చేయడం ఎంతవరకు సబబని తపస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పూజరి రమేష్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోని సర్కారు బడుల్లో విద్యార్థుల నమోదుతో పాటు, అభ్యసన సామర్థ్యాలను పెంచాలంటూ సూచిస్తూనే.. మరో వైపు సర్దుబాటు పేరిట సిబ్బంది లేకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ప్రక్రియను పునఃపరిశీలించాలని కోరారు. ప్రాథమిక పాఠశాలలో ప్రతి తరగతికి ఒక టీచరు ఉండే విధంగా చూడాలని, పీఎస్‌హెచ్ఎంను నియమించాలని సూచించారు. 30 మందిలోపు విద్యార్థులు ఉంటే ఇద్దరు ఉపాధ్యాయులు, 60 మంది వరకు ఉంటే నలుగురు ఉండే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు సవరించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉన్నప్పుడు మాత్రమే ప్రజలకు నమ్మకం కుదురుతుందని, అప్పుడే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని స్పష్టంచేశారు.

సేంద్రియ ఎరువు ఉపయోగించండి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రామకృష్ణ

యాచారం: రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు రామకృష్ణ, రాజేశ్వర్లు అన్నారు. యాచారం రైతు వేదికలో శనివారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాగులో సాధ్యమైనంత వరకు పశువుల ఎరువును ఉపయోగించాలని సూచించారు. నీటి పొదుపు కోసం డ్రిప్‌ను వాడాలని, తక్కువ నీటితో స్వల్పకాలిక పంటలను సాగు చేయాలని పేర్కొన్నారు. వాతావరణ మార్పులను బట్టి పంటల సాగులో ముందుకెళ్లాలని చెప్పారు. అనంతరం మొగుళ్లవంపు గ్రామానికి చెందిన రైతు నాయిని రాఘవరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో కూరగాయలు, వరి సాగులో అతని అనుభవాలను రైతులకు వివరించారు.మండల వ్యవసాయ అధికారి రవినాథ్ ఉన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న నాయకులు, భక్తులు

మొయినాబాద్‌రూరల్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు సంగెరి మల్లేశ్ అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో గల సోమేశ్వర ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని చిలుకూరు బాలాజీ శివాలయ వేదపండితుడు సురేష్‌స్వామి ఆధ్వర్యంలో మంత్రోచ్చరణల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో సంగెరి మల్లేష్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రకాశ్, వైసీపీ జిల్లా నాయకుడు రాజయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు స్వామివారి దర్శనం, అన్నప్రసాదం అందించారు.

సాగుకు సిద్ధం

వానాకాలం పంటల సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. అడపాదడపా కురిసిన వర్షాలకు దుక్కులు సిద్ధం చేస్తూ.. విత్తనాలు విత్తడానికి సన్నద్ధం అవుతున్నారు. రుతుపవనాలు సకాలంలో ప్రవేశిస్తాయన్న ప్రకటనతో ముందుస్తుగానే విత్తనాల కొనుగోలుకు మక్కువ చూపుతున్నారు.

అందుబాటులో విత్తనాలు, ఎరువులు

- వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ
- సాగుపై అవగాహన సదస్సులు



విత్తనాలు విత్తేందుకు సిద్ధం చేసిన పాలెం

కడ్తాల్: వర్షకాలం ఆరంభం జూన్‌లో రోహిణి, మృగశిర కార్తెలలో విత్తనాలు విత్తుకుంటే పంటలు బాగా పండుతాయని కర్షకుల ప్రగాఢ నమ్మకం. గతేడాది కాలం ఆలస్యం కావడంతో రైతులు సకాలంలో పొలాలను సాగుకు అనుకూలంగా మల్చుకోలేక పోయారు. సమయానికి విత్తనాలు విత్తలేదు. ఫలితంగా ఆశించిన దిగుబడి రాక నష్టాలను చవిచూసారు. అన్నీ అనుకూలిస్తే పంటలు బాగా పండి, అధిక లాభాలు వచ్చే అవకాశం ఉంటుంది.

అంచనా 21 వేల ఎకరాలు

ప్రస్తుత సీజన్‌లో మండలంలో సుమారు 21 వేల ఎకరాల్లో పంటలు సాగు చేయవచ్చని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు కురిసిన వర్షాలకు రైతులు తమ పొలాలను సిద్ధం చేసుకున్నారు. నేడో రేపో లేదంటే ఈ నెల 8న మృగశిర కార్తె తర్వాత వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్న నమ్మకంతో ముందస్తుగానే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసేందుకు విత్తన దుకాణాలకు పరుగులు పెడుతున్నారు. విత్తనాల ఎంపిక, పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షేత్ర స్థాయిలో వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ఖరీఫ్ సాగు అంచనా

రకం	ఎకరాలు
వరి	8500
పత్తి	7500
మొక్క జొన్న	3500
కందులు	500
ఇతర చిరు ధాన్యాలు	1000



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

అవగాహన కల్పిస్తున్నాం



వానాకాలం పంటల సాగు గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇటీవల కురిసిన మోస్తరు వర్షాలకు దుక్కులు సిద్ధం చేసుకున్నారు. రుతుపవనాల అనంతరం వర్షాలు కురిసాకే విత్తనాలు విత్తుకోవాలని సూచించాం. వారి సందేహాలకు మండల పరిధిలోని నాలుగు క్లస్టర్లలో వ్యవసాయ విస్తరణ అధికారులు అందుబాటులో ఉండి, సలహాలు సూచనలు ఇస్తున్నారు. – శ్రీలత.ఏఓ, కడ్తాల్

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

కాంగ్రెస్ నాయకులు

- పలు ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



మాడ్గుల: కోల్కులపల్లిలో ఇంటి నిర్మాణానికి ముగ్గు పోస్తున్న నాయకులు

ఆమనగల్లు: కాంగ్రెస్ పాలనలోనే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఆమనగల్లు మాజీ వైస్‌ఎంపీపీ జక్కు అనంతరెడ్డి అన్నారు. ఆమనగల్లు మండలం మంగళపల్లి గ్రామంలో శనివారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి పార్టీ నాయకులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జక్కు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని చెప్పారు. ప్రభుత్వం సూచించిన విధంగా ఇంటిని నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు జంగయ్య, గ్రామ కార్యదర్శి వెంకటయ్య, గ్రామస్తులు మల్లయ్య, నర్సింహ, అంజయ్య, బాలకిష్టయ్య పాల్గొన్నారు. అలాగే ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి చంద్రాయణపల్లితండాలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాగ్యానాయక్, శ్రీనునాయక్, హర్యానాయక్, గోపాల్‌నాయక్, మల్లేశ్‌నాయక్, రవినాయక్, శంకర్, గోపాల్, లక్ష్మణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా..

మాడ్గుల: అర్హులకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండల పరిధి కోల్కులపల్లి గ్రామంలో లబ్ధిదారుల ఇంటి నిర్మాణానికి ముగ్గుపోసి, పనులు ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు నిరంతర ప్రక్రియని, దశలవారీగా అర్హులందరికీ లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. నాయకులు కృష్టారెడ్డి, మల్లయ్య, దుర్గ తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: చంద్రాయణపల్లితండాలో నిర్మాణపనులు ప్రారంభిస్తున్న నాయకులు

మూడు నెలల రేషన్ వచ్చేసింది

- యూనిట్‌కు 18 కిలోల చొప్పున పంపిణీ
- దుకాణాలకు చేరిన బియ్యం
- నేటి నుంచి సరఫరా షురూ



ఇబ్రహీంపట్నం గోదాం (స్టాక్ పాయింట్)లో సన్న బియ్యం నిల్వలు

ఇబ్రహీంపట్నం: మూడు నెలల రేషన్ కోటా నిత్యవసరా దుకాణాలకు చేరుకుంది. యూనిట్‌కు 18 కిలోల చొప్పున ఆదివారం నుంచి లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. వానాకాలం ప్రకృతి విపత్తుల దృష్ట్యా ఫౌర సరఫరాల యంత్రాంగం కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో జూన్, జూలై, ఆగస్టు బియ్యాన్ని ముందస్తుగా ఇచ్చేందుకు నిర్ణయించింది.

ఉగాది పర్వదినం నుంచి..

ఉగాది పర్వదినం నుంచి ఆహార భద్రత కార్డుదారులకు దొడ్డు బియ్యం స్థానంలో సన్నాల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఏప్రిల్, మే నెలల్లో ఈ పథకం సాఫీగా సాగింది. ప్రస్తుతం ఒకే దఫా మూడు నెలల బియ్యం ఇవ్వనుంది. ఈ మేరకు ఇబ్రహీంపట్నం గోదాం పాయింట్ నుంచి బియ్యాన్ని దుకాణాలకు తరలిస్తున్నారు.

స్థలంలేక.. విడతలుగా..

ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల మండలాల్లోని 89 రేషన్ షాపుల ద్వారా సుమారు 900 టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తారు. ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున.. ఈసారి ఒకేసారి మూడు నెలల కోటాను పంపిణీ చేస్తుండటంతో.. సుమారు 2700 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని తరలించాల్సివస్తోంది. ఇప్పటికే 40 షాపుల్లోకి పూర్తి స్థాయి బియ్యాన్ని తరలించగా, కొన్ని షాపుల్లో మూడు నెలల కోటాను పెట్టుకునేందుకు స్థలం లేకపోవడవంతో విడతలవారీగా బియ్యాన్ని తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఒకేసారి మూడు నెలల బియ్యం ఇస్తుండటంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నెలనెలా దుకాణానికి వెళ్లాల్సిన తిప్పలు తప్పాయంటున్నారు. సుమారు 45 వేలకు పైగా ఆహార భద్రతకార్డులు ఈ మూడు మండలాల్లో ఉన్నాయి.

ఒకేసారి తరలిస్తున్నాం



మూడు నెలల సన్న రైస్‌ను ఒకేసారి తరలిస్తున్నాం. స్టాక్ పాయింట్ నుంచి 89 రేషన్ దుకాణాలకు సుమారు 900 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రతి నెల తరలిస్తుంటాం. ప్రస్తుతం ఒకేసారి ఇస్తుండటంతో ఈ నెలలో 2700 మెట్రిక్ కోటాను తరలించాల్సి వస్తోంది. అందుకు తగిన ఏర్పాటు చేశాం. – జ్యోతి, స్టాక్ పాయింట్ ఇన్‌చార్జి, ఇబ్రహీంపట్నం

పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి కృషి



టీడబ్ల్యూజేఎఫ్ నూతన సభ్యులతో జిల్లా నాయకులు

కడ్తాల్: జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి టీడబ్ల్యూజేఎఫ్(తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్) నిరంతరం కృషి చేస్తుందని ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు అన్నారు. మండల పరిధి మైసిగండి శివాలయం గెస్ట్ హౌస్‌లో శనివారం ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాల ఫెడరేషన్ సమీక్ష నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా సైదులుతో పాటు జాతీయ కమిటీ సభ్యులు దేవేందర్, జిల్లా నాయకులు సురేశ్, శ్రీనివాసాచారి, గణేశ్, రఘుపతి, చంద్రశేఖర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి టీడబ్ల్యూజేఎఫ్ సుదీర్ఘ కాలంగా ఉద్యమిస్తుందని పేర్కొన్నారు. సమస్యల సాధనకు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. అనంతరం ఆమనగల్లు బ్లాక్ ఫెడరేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శంకర్, గౌరవ అధ్యక్షుడిగా నర్సింహ, ప్రధాన కార్యదర్శిగా బోడ నరేశ్, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్, అఫీజ్, లక్ష్మణ్, కోశాధికారిగా యాదగిరి, సంయుక్త కార్యదర్శులుగా తిరుపతయ్యగౌడ్, తిరుపతయ్య, ప్రచార కార్యదర్శులుగా రవి, గణేశ్, సహాయ కార్యదర్శిగా శేఖర్, కార్యవర్గ సభ్యులుగా శ్రీను, అజీం, జిల్లా కమిటీ సభ్యులుగా యూనిస్, కోట్ల వెంకటేశ్, చంద్రశేఖర్‌లను ఎన్నుకున్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

- 3నుంచి భూభారతి
- తహసీల్దార్ సునీతారెడ్డి



ఇబ్రహీంపట్నం: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించే భూభారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సునీతారెడ్డి సూచించారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 3 నుంచి 17 వరకు మండల పరిధి గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. భూ సమస్యలపై ఫిర్యాదులను స్వీకరిస్తామని పేర్కొన్నారు. సదస్సులకు ఇబ్రహీంపట్నం మండలంలో రెండు టీమ్‌లను ఏర్పాటు చేశామని, ఒక టీమ్‌కు తాను, మరో టీమ్‌కు డిప్యూటీ తహసీల్దార్లు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తారని వెల్లడించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఏ ఊరిలో.. ఏరోజు

ఏ రోజున ఏ ఊరిలో సదస్సులు నిర్వహించనున్నారో వాటి వివరాలు ఇలా ఉన్నాయి. 3న ముకునూర్, 4న కప్పపహాడ్, 5న నాగన్‌పల్లి, 6న నెర్రపల్లి, 9న పోచారం, రాంరెడ్డిగూడ, 10న చర్ల పటేల్‌గూడ, 11న మంగల్‌పల్లి, సాహెబ్‌గూడ, 12న ఇబ్రహీంపట్నం ఖాల్సా, 13న ఆదిబట్ల, 16న బొంగ్లూర్ రెవెన్యూ గ్రామాల్లో తహసీల్దార్ సునీతారెడ్డి ఆధ్వర్యంలో జరగనున్నాయి. డిప్యూటీ తహసీల్దార్ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో 3న తుర్కగూడ, ఎర్రకుంట, 4న ఖానాపూర్, 5న పొల్కంపల్లి, ఎన్గల్‌గూడ, 6న రాయిన్‌గూడ, 9న రాయపోల్, 10న ఇబ్రహీంపట్నం భాగయత్, ఇస్మాయిల్‌షా పంపు, తట్టిఖానా, అల్లిమియాకుంట, 11న ఫిరోజ్‌గూడ, కొంగరకలాన్, 12న ఎల్మినేడు, తడ్లకల్వ, 13న తులేకలాన్, 16న హఫీజ్‌పూర్, దండుమైలారం, 17న రాందాసుపల్లి గ్రామాల్లో నిర్వహించనున్నారు.

ఆమనగల్లు మండలంలో..

ఆమనగల్లు: ఆమనగల్లు మండలంలో భూ భారతి రెవెన్యూ సదస్సులు జూన్ 3 నుంచి 16వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ లలిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో రైతులు.. భూ సంబంధిత సమస్యలపై దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 3న రాంనుంతల, 4న కోనాపూర్, 5న విఠాయిపల్లి, 7న చెన్నంపల్లి, 9,10న ఆమనగల్లు, 11న సింగంపల్లి, 12న పోలెపల్లి, 13న శెట్టిపల్లి, 16న ఆకుతోటపల్లి గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు.

ఘనంగా బొడ్రాయి పండుగ



బొడ్రాయికి పూజలు చేస్తున్న నాయకులు

కడ్తాల్: మండలంలోని ముద్విన్ పంచాయతీ పరిధి కోర్షకొండ తండాలో బొడ్రాయి పండుగ శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనం, కలశాలతో అభిషేకం చేశారు. నైవేద్యం సమర్పించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, భక్తులు బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ నిర్వాహకు దశరథ్‌నాయక్ రూ.25 వేలు, ఆనంద్, మాజీ సర్పంచ్ తులసీరాం, మాజీ ఉప సర్పంచ్ పాండు నాయక్‌లు రూ.5 వేల చొప్పున అందజేశారు. మాజీ సర్పంచ్ యాదయ్య, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటయ్య, నాయకులు లాయక్‌అలీ, జంగయ్య, సౌజన్య, రాజునాయక్, మహేశ్‌యాదవ్, రాజు, శ్రీను, చందర్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ఏడీఏ శోభారాణి



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ శోభారాణి

ఆమనగల్లు: నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆమనగల్లు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కె.శోభారాణి హెచ్చరించారు. పట్టణంలోని రైతు వేదిక భవనంలో శనివారం ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాల విత్తన డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. లైసెన్స్ కలిగిన వారే విత్తనాలు, ఎరువులు విక్రయించాలని ఆదేశించారు. విత్తన డీలర్లు తప్పనిసరిగా అధీకృత కంపెనీల నుంచే విత్తనాలు తీసుకుని, రైతులకు విక్రయించాలని, విధిగా రసీదు ఇవ్వాలని సూచించారు. రసీదులపై రైతుల సంతకాలు సేకరించాలని చెప్పారు. డీలర్లు బిల్ బుక్స్, స్టాక్ రిజిస్టర్లను తప్పనిసరిగా మెయింటెనెన్స్ చేయాలని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ టీమ్‌లతో విత్తన విక్రయ దుకాణాలను తనిఖీ చేస్తామని స్పష్టంచేశారు. సమావేశంలో తహసీల్దార్ లలిత, వ్యవసాయ అధికారులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీలత, అరుణకుమారి, రేణుక చక్రవర్తి, ఎస్ఐలు సీతారాంరెడ్డి, చంద్రశేఖర్, నాగరాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవకులకు ప్రశంసాపత్రాలు



మాజీ సర్పంచులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న శ్రీరామ్ మోహన్

కడ్తాల్: ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం జన్‌మన్ యోజన) పథకం ద్వారా అందించిన సేవలకు.. కడ్తాల్, అన్మాస్‌పల్లి, ఎక్వాయిపల్లి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్‌లు (2019–24) ప్రశంసా పత్రాలు అందుకున్నారు. శనివారం మండల కేంద్రంలోని విద్యుత్ అసిస్టెంట్ ఇంజినీర్ కార్యాలయం వద్ద, దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థ రాజేంద్రనగర్ సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్రీరామ్ మోహన్.. మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, శంకర్, సుగుణలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఆదివాసీ, గిరిజనుల అభివృద్ధి కోసం అభియాన్ పథకాన్ని ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా ఆదివాసీలకు మౌలిక వసతుల ఏర్పాటులో భాగంగా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూపొందించిన ప్రణాళికలో భాగంగా తమ హయాంలో విద్యుత్, సురక్షిత తాగునీరు, విద్య, జీవనోపాధి పథకాలను ఆదివాసీలకు చేరువయ్యేలా కృషి చేసినందుకు ఈ గుర్తింపు లభించిందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రశంసించిన అధికారులు, గ్రామస్తులకు, నాటి పాలక వర్గ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈలు బాలకృష్ణ, శంకర్, ఏఈ నరేందర్, నాయకులు రాంచంద్రయ్య, అశోక్, కృష్ణయ్య, యాదయ్యగౌడ్, శేఖర్, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

ముంపు.. ముప్పే!

గత చేదు అనుభవాలతో ముంపు ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వానాకాలం నేపథ్యంలో వరద భయంతో వణికిపోతున్నారు. చెరువులు, కాల్వలు, కుంటలు అన్యాక్రాంతం అయ్యాయని, నాలాలు కుంచించుకుపోయాయని, దీంతో ఏటేటా వరద భయం వెంటాడుతోందని వాపోతున్నారు.

- వానాకాలం.. పొంచిఉన్న ప్రమాదం
- చెరువులు, కుంటలు మాయం!
- కుంచించుకుపోయిన నాలాలు
- లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతున్న జల ప్రవాహం



అవెన్యూ కాలనీలో ఇళ్ల మధ్య నుంచి ప్రవహిస్తున్న వాగు(ఫైల్)

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలో అనేక చెరువులు, కుంటలు రియల్టర్ల చేతి వాటానికి కనుమరుగయ్యాయి. దీంతో ప్రతి వానాకాలంలో కాలనీలు జలమయమవుతున్నాయి. 2020 అక్టోబర్‌లో ఒక్కరోజు కురిసిన భారీ వర్షానికి మున్సిపాలిటీ పరిధిలోని అనేక కాలనీలు నీట మునిగాయి. అయినా పురపాలక, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కబ్జాకోరులపై ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని బాధిత ప్రాంతాల ప్రజలు ఆరోపిస్తున్నారు. రాగన్నగూడలోని గంగరాయి చెరువులోకి నీరు వచ్చే బందం వాగును కబ్జా చేసి, ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు.

ఎర్రకుంట చెరువు..

మన్నెగూడలోని ఎర్రకుంట చెరువును అక్రమార్కులు చెరబట్టారు. చుట్టూ ఇష్టానుసారంగా భారీ భవంతులు నిర్మించారు. నిర్మిస్తూనే ఉన్నారు. అంతే కాకుండా చెరువు నిండిన అనంతరం వరద ముందుకు సాగేందుకు ఏర్పాటు చేసిన కాల్వలను నామరూపాల్లేకుండా చేశారు. ఫలితంగా ఏటా వరద ప్రవాహం.. రాగన్నగూడ, మన్నెగూడలోని అనేక కాలనీలను ముంచెత్తుతోంది.

ఇళ్ల మధ్యలో వాగు

ఐదేళ్లుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువు నిండి అలుగు పారుతుంటుంది. దీంతో ఇంజాపూర్‌లోని ఆపిల్ అవెన్యూ కాలనీ, ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల మధ్యలో నుంచే వాగు ప్రవహిస్తుంటుంది. ఆ సమయంలో వరద తీవ్ర పెరిగితే.. ఇంజాపూర్ నుంచి తొర్రూర్ వెళ్లే మార్గంలో వాగు ప్రవహిస్తుంటుంది. ఈ క్రమంలో గతంలో రోడ్డు దాటే క్రమంలో ఇద్దరు యువకులు కొట్టుకుపోయి, మృతి చెందిన విషయం తెలిసిందే. ఇక్కడ వంతెన నిర్మాణం చేపట్టాలనే డిమాండ్ ఉన్నా.. అధికారులు, పాలకులు ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు.

జాగ్రత్తలు తీసుకుంటాం



అధిక వర్షాలతో పురపాలక సంఘం పరిధిలోని 22 కాలనీలు ముంపునకు గురయ్యే అవకాశం ఉన్నట్లు గుర్తించాము. ఇరిగేషన్, రెవెన్యూ శాఖలతో సమన్వయంతో ముందుకు వెళ్తాము. డిజాస్టర్ టీమ్‌లను ఏర్పాటు చేస్తాం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. నాలాలో చెత్తా చెదారం, వేయవద్దు. – కె.అమరేందర్ రెడ్డి, కమిషనర్, తుర్కయంజాల్